క్లుప్తంగా

డయేరియాపై అవగాహన ఉండాలి



వినుకొండ(నూజెండ్ల): మండలంలోని భారతాపురం గ్రామ పంచాయతీలో స్వచ్ఛభారత్ మిషన్ మండల కో ఆర్డినేటర్ పి.ప్రభాకరరావు అధ్యక్షతన స్టాప్ డయేరియా కార్యక్రమంపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసర్పంచి తోట రమణ మాట్లాడుతూ క్లాప్ మిత్రాలు ఎప్పటికప్పుడు కాలువల్లో చెత్త నిల్వ ఉండకుండా చూడాలన్నారు. గ్రామంలోని వీధులను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, డయేరియా తదితర వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీధర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ షేక్ బాషా, ఏఎన్ఎం టి.రాజ్యలక్ష్మి, గురుప్రియ పాల్గొన్నారు.

వృద్ధురాలిపై దాడి

నాదెండ్ల: మనుమడికి అమ్మమ్మ సమయానికి భోజనం పెట్టలేదన్న అక్కసుతో కూతురు, అల్లుడు దాడిచేసి గాయపరిచిన ఘటన గురువారం గొరిజవోలులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఆర్ సుబ్బులు తన కుమార్తె మరియమ్మ, అల్లుడు ఇమ్మానియేలు కుటుంబంతో కలసి నివసిస్తోంది. బుధవారం మనుమడు వినోద్ తనకు అమ్మమ్మ సుబ్బులు భోజనం పెట్టలేదని తల్లి మరియమ్మకు చెప్పాడు. దీంతో కోపోద్రిక్తులైన కుమార్తె మరియమ్మ, అల్లుడు ఇమ్మానియేలు, మనుమడు వినోద్ దాడి చేశారు. దీంతో గాయాలపాలైన సుబ్బులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జె.బలరామ్‌రెడ్డి తెలిపారు.

ఏపీ మోడల్ స్కూల్‌లో శిక్షా సప్తాహ్

రొంపిచర్ల: ఆట పాటల వల్ల పిల్లల్లో సహకార ధోరణి అలవడుతుందని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రవినాయక్ అన్నారు. మండలంలోని వి.రెడ్డిపాలెంలోని ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలో శిక్షా సప్తాహ్ పురస్కరించుకొని గురువారం నిర్వహించిన పద్యపఠన పోటీలు, కోలాటం పోటీలను ప్రారంభించి ఆయన మాట్లాడారు. పిల్లలు ఆడిన కోలాటం, పద్యపఠన కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

చందవరంలో ఆధార్ సేవలు

నాదెండ్ల: చందవరం సచివాలయంలో గురువారం ఆధార్ అప్‌డేట్ సెంటర్ ప్రారంభించారు. శుక్రవారం సాతులూరులో ఆధార్ సేవలు అందించనున్నట్లు ఎంపీడీఓ షేక్ జాకీర్‌హుస్సేన్ తెలిపారు.

మహిళ శరీరం నుంచి 6.5 కిలోల కణితి తొలగింపు

నరసరావుపేట: సత్తెనపల్లిరోడ్డులోని డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్‌లో ఓ మహిళ శరీరం నుంచి 6.5 కిలోల బరువైన కణితి తొలగించి ఆమె ప్రాణాలను కాపాడారు. హాస్పిటల్ ఎండీ డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి గురువారం వివరాలు వెల్లడించారు. నరసరావుపేట మండలంలోని పెద్దరెడ్డిపాలేనికి చెందిన తిరుపతమ్మ తీవ్రమైన కడుపునొప్పితో తమ హాస్పిటల్‌ను చేరినట్లు చెప్పారు. ఆమెకు వైద్య పరీక్షలు చేసిన అనంతరం పొట్టలో కణితి ఉందని నిర్ధారించామన్నారు. వైద్యుల సూచన మేరకు ఆమె ఆపరేషన్‌కు అంగీకరించిందన్నారు. ఆమె శరీరంలో గర్భాశయం చుట్టూ అలుముకొని ఉన్న 6.5 కిలోల క్యాన్సర్ గడ్డను తమ వైద్య బృందం ఎంతో శ్రమించి తొలగించటం జరిగిందన్నారు. ఆపరేషన్ అనంతరం పేషెంట్ ఆరోగ్యంగా ఉన్నారని వివరించారు.

కాలనీని ముంచెత్తిన కాలువ నీరు



నరసరావుపేటరూరల్: లింగంగుంట్ల పంచాయతీ పరిధిలోని ఎన్ఎస్‌పీ కాలనీలోని నివాసాల్లోకి గోవిందపురం కాలువ నీరు వచ్చి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్ఎస్‌పీ కాలనీలోని రైల్వే ట్రాక్ వెంట ఉన్న 30 ఇళ్లలోకి రెండు రోజులుగా నీరు వచ్చి చేరింది. దీంతో కాలనీ వాసులు మోకాళ్లలోతు నీటిలోనే కాలం వెల్లదీస్తున్నారు. తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ నుంచి నీటిని విడుదల చేశారు. గోవిందపురం మేజర్‌కు విడుదల చేసిన నీరు కాలువల్లో పూడిక కారణంగా పొంగిపొర్లుతోంది. ఎన్ఎస్‌పీ కాలనీలోని ఎస్‌పీ కార్యాలయం ఎదురు రోడ్డులోని రామచంద్రనగర్ ఇళ్లల్లోకి నీరు వచ్చి చేరింది. రైల్వే డబుల్ లైన్ ఏర్పాటు సమయంలో కాంట్రాక్టర్ కెనాల్ కాలువలో కాంక్రీట్‌ను వదిలివెళ్లారు. దీంతో పాటు వ్యర్థాలు కూడా నిలిచిపోవడంతో నీటి ప్రవాహం నిలిచిపోయి పొంగిపొర్లి సమీపంలోని ఇళ్లలోకి వచ్చి చేరుతుంది. ఈ నీరు కాలనీ నుంచి లింగంగుంట్లకు వెళ్లే అండర్ గ్రౌండ్ బ్రిడ్జిలోకి రావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అయ్యవార్లకు శిక్షణ.. విద్యార్థులకు ‘శిక్ష’

- శంకరభారతీపురం హైస్కూల్‌లో టీచర్లకు శిక్షణ తరగతులు
- పాఠశాలలో తరగతి గదులు కేటాయింపు
- గదులు లేక ఆరుబయట, చెట్ల కింద విద్యార్థులకు తరగతులు



కళా ప్రాంగణంలో తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం



ఆరుబయటే విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న టీచర్

నరసరావుపేట రూరల్: ప్రభుత్వ ఉపాధ్యాయుల శిక్షణ.. విద్యార్థులకు ‘శిక్ష’గా మారాయి. శిక్షణ తరగతుల పేరిట తరగతి గదులను ఉపాధ్యాయులకు కేటాయించడంతో ఆరుబయటే తరగతులు నిర్వహించాల్సిన వస్తుంది. మండలంలోని లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో కొన్ని రోజులుగా తరగతి గదులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షంలోను ఆరుబయటే విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. డివిజన్‌లోనే ప్రముఖ పాఠశాలల్లో శంకరభారతీపురం పాఠశాల ఒకటి. దాదాపు 1300 విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. దాదాపు 50 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. పాఠశాలలో 24 గదులు ఉన్నాయి. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ప్రస్తుతం ఉన్న గదులు సరిపోతాయి. అయితే ఇందులో ఈవీఎంలను భద్రపరిచేందుకు ఒక గది, మండలంలోని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, మెటీరియల్ కోసం ఒక గది, నాడు– నేడు మెటీరియల్ కోసం ఒక గదిని కేటాయించారు. దీంతో పాటు ప్రభుత్వ ఉపాధ్యాయులకు నిర్వహించే శిక్షణ శిబిరాలు ఈ పాఠశాలలోనే తరచూ నిర్వహిస్తున్నారు. ఇందుకోసం మూడు గదులను కేటాయిస్తున్నారు. పదిరోజులుగా ఇక్కడ ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. తరగతి గదుల కొరతతో చెట్ల కింద, కళా ప్రాంగణాల వద్ద విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం వలన తరగతి గదులు సరిపోవడం లేదని ప్రధానోపాధ్యాయని పార్వతి తెలిపారు.

‘తల్లికి వందనం’ అమలుకు కసరత్తు

డీఈఓ వెంకటేశ్వర్లు



జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న డీఈఓ వెంకటేశ్వర్లు

శావల్యాపురం: తల్లికి వందనం పథకం అమలుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుందని జిల్లా విద్యాశాఖాధికారి మాదినేని వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం తనిఖీ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుతో పాటు ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనాన్ని విద్యార్థులకు అందించేలా బాధ్యత వహించాలన్నారు. అలాగే ప్రభుత్వ నూతనంగా అన్నీ ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు ఈనెల 29వ తేదీ వరకు నిర్వహించాలన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఏర్పాటు చేసిన బాలికల జూనియర్ కళాశాల్లోని విద్యార్థినులకు పాఠ్యాపుస్తకాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బాలికల కోసం ప్రత్యేకంగా ల్యాబ్ సదుపాయం కల్పించనున్నట్లు చెప్పారు. ఒకటి నుంచి పది తరగతుల వరకు విద్యా సామగ్రితో పాటు యూనిఫాం కూడా నూరుశాతం అందించినట్లు వివరించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయనతో పాటు ఎంఈఓ మద్దికుంట సాంబశివరావు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కుమ్మరి శ్రీనివాసరాజు, సీనియర్ ఆంగ్ల బోధకులు బెజవాడ నాగేశ్వరరావు, పీడీ రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

దోమల లార్వాల నిర్మూలనకు చర్యలు



వల్లప్పచెరువు నీటిలో గంబూషియా చేపలను వదులుతున్న దృశ్యం

నరసరావుపేట: డెంగీ, మలేరియా, ఫైలేరియా, గున్యా, మెదడువాపు వ్యాధులకు కారణమయ్యే దోమల లార్వాల నిర్మూలనకు గంబూషియా చేపలను నీటి కుంటల్లో విడుదల చేస్తున్నట్లు జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ రవీంద్ర రత్నాకర్ పేర్కొన్నారు. గురువారం పట్టణ శివారు వల్లప్ప చెరువులోని నీటిలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మావతితో కలసి గంబూషియా చేపలను వదిలారు. డాక్టర్ రత్నాకర్ మాట్లాడుతూ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉన్న నీటి కుంటల్లో లార్వాలను నాశనం చేసేందుకు 1.5లక్షల గంబూజియా చేపలను సేకరించామన్నారు. జూలై మాసం నుంచి దోమల వలన వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఆరోగ్యశాఖ అప్రమత్తమై జిల్లాలోని ప్రధాన కేంద్రాలైన సత్తెనపల్లి, నరసరావుపేట, చిలకలూరిపేట, పిడుగురాళ్ల, గురజాల, మాచర్ల, వినుకొండ ప్రాంతాల్లోని నీటి కుంటలు, బావులు, చెరువుల్లో ఈ గంబూషియా చేపలను విడుదల చేశామన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



బొల్లాపల్లి ఉన్నత పాఠశాలలో సంప్రదాయ వేషధారణలో విద్యార్థులు



జాలదిలో శిక్షా సప్తాహ్‌లో భాగంగా నృత్యాల్ని ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

బొల్లాపల్లి: జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా దేశ ప్రాచీన నాగరికత, భిన్నత్వంలో ఏకత్వం తెలియజేసేందుకే ఈ శిక్షా సప్తాహ్ కార్యక్రమాల నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ కె.పార్వతి తెలిపారు. మండలంలోని వెల్లటూరు, కనుమలచెరువు, బ్రిడ్జి తండా తదితర పాఠశాలలను గురువారం సందర్శించారు. 4వ రోజు ఈ వారోత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన నిర్వహించారు. సంప్రదాయ వేషధారణ, నృత్యాలు, పాటలు, నాటికలు వంటి కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థుల్లో ప్రాచీన నాగరికతపై అవగాహన పెంపొందించారు. కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు షేక్ అలీసా, కె.అపర్ణ, వి.కోటానాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

యడ్లపాడు: విద్యార్థుల్లోని సృజనాత్మకత వెలికి తీసేందుకు శిక్షా సప్తాహ్ ఎంతగానో దోహదపడుతుందని ఎంఈఓ ఎం.నాగరత్నం తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో గురువారం విద్యార్థులకు సాంస్కృతిక దినోత్సవాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా విద్యార్థులకు పద్యాలు, అభినయ గేయాలు, నాటికలు, సంప్రదాయ నృత్య ప్రదర్శనలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం వారిచే ఆయా ప్రదర్శనలను చేయించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఆలోకం లక్ష్మీతులసి, ఉపాధ్యాయులు పద్మజ, రత్నకుమారి హాజరయ్యారు.

నాదెండ్లలో..

నాదెండ్ల: భిన్నత్వంలో ఏకత్వం భారతీయ సంస్కృతి అని, విద్యార్థులు చిన్నతనం నుంచే దేశ వారసత్వ సంస్కృతిని అలవర్చుకుని గొప్ప పౌరులుగా ఎదగాలని ఎంఈఓ కృష్ణారెడ్డి చెప్పారు. జాతీయ విద్యా విధానంలో భాగంగా గురువారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సాంస్కృతిక దినోత్సవంగా జరిపారు. గణపవరం చవిటిపాలెం ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు.

సాగర్ జలాలు తాగునీటి అవసరాలకే వినియోగించాలి

డీఈ రామారావు

శావల్యాపురం: సాగర్ జలాలు తాగునీటి అవసరాలకు విడుదల చేసినట్లు ఎన్నెస్పీ డీఈ చాట్రగడ్డ రామారావు తెలిపారు. గురువారం మండలంలోని గంటావారిపాలెం వద్ద అద్దంకి బ్రాంచ్ కెనాల్‌ను పరిశీలించారు. డీఈ మాట్లాడుతూ 1,300 క్యూసెక్కులు విడుదల చేసినట్లు తెలిపారు. నరసరావుపేట, నకరికల్లు, రొంపిచర్ల, శావల్యాపురం, వినుకొండ, ఈపూరు తదితర మండలాల పరిధిలోని చెరువులు వాగుల కుంటలు నూరుశాతం నింపేలా చర్యలు చేపట్టామని వివరించారు. అందులో భాగంగా ప్రకాశం బాపట్ల జిల్లాలకు 800 క్యూసెక్కులు కేటాయించగా మిగిలిన నీటిని పల్నాడు జిల్లా పరిధిలోని చెరువులు నింపటానికి ఎన్నెస్పీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో నూరు శాతం చెరువులు నింపటానికి క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకున్నామని చెప్పారు. సాగర్ జలాలు వృథా చేయరాదని కోరారు. మరో నాలుగు రోజుల పాటు మాత్రమే సాగర్ జలాల సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

నేడు విద్యుత్‌సరఫరా నిలిపివేత

నాదెండ్ల: విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ అశోక్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకూ సరఫరా ఉండదని చెప్పారు. సాతులూరు, చందవరం, గొరిజవోలు గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

కృష్ణవేణి కళాశాలకు అటానమస్ గుర్తింపు



అటానమస్ పత్రాలను ప్రదర్శిస్తున్న ప్రిన్సిపాల్ నాతాని, అధ్యాపకులు


నరసరావుపేట ఈస్ట్: పట్టణంలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాలకు స్వయంప్రతిపత్తి(అటానమస్) హోదా ఇస్తూ యూజీసీ నుంచి అనుమతి లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. తమ కళాశాలకు 2024–25 విద్యా సంవత్సరం నుంచి 2033–34 విద్యా సంవత్సరం వరకు 10 సంవత్సరాల పాటు అటానమస్ హోదా ఉంటుందని వెల్లడించారు. నాణ్యమైన విద్యా ప్రమాణాలతో కూడిన బోధన, క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో అత్యధిక శాతం ఉద్యోగాల కల్పన, విద్యతో పాటు క్రీడలలో విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దటం వంటి ప్రత్యేక కృషితో తమ కళాశాలకు అత్యున్నత హోదా లభించిందని వివరించారు. అటానమస్ ద్వారా స్వయం విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పాఠ్యాంశాలను రూపొందించుకోవటం, పరిశ్రమలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ, కోర్సుల నిర్వహణ, సర్టిఫికెట్ల కోర్సులకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. అటానమస్ హోదా వలన స్వయంగా పరీక్షల నిర్వహణతో పాటు సిలబస్‌లో మార్పులు చేర్పులు చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. అలాగే మెరుగైన, అత్యధిక జీత భత్యాలతో మల్టీ నేషనల్ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించవచ్చని తెలిపారు.

రేషన్ డీలర్‌పై కేసు

నాదెండ్ల: మండలంలోని కనపర్రు గ్రామానికి చెందిన రేషన్ డీలర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. గ్రామానికి చెందిన గుడిపూడి వీరయ్య రేషన్‌డీలరుగా పనిచేస్తున్నాడు. బుధవారం చిలకలూరిపేట సీఎస్ డీటీ లక్ష్మణరావు డిపోను తనిఖీ చేశాడు. ఈ తనిఖీలో సుమారు 30 క్వింటాళ్ల బియ్యం, పంచదార, కందిపప్పు, గోధుమలు నిల్వల్లో రికార్డుల్లో తేడాలున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు వీరయ్యపై కేసు నమోదు చేశారు.

గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పాలి

సీఐ శ్రీరాం వెంకట్రావు



పిడుగురాళ్ల: గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పాలని పిడుగురాళ్ల సీఐ శ్రీరాం వెంకట్రావు అన్నారు. మండలంలోని జానపాడు గ్రామంలో బుధవారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గొడవలు సృష్టించకూడదని, ఎన్నికలు ముగిసాయని, అందరు స్నేహభావంతో మెలిగి ఎవరికి ఎలాంటి హాని జరగకుండా చూడాలని తెలిపారు. గ్రామాల్లో అవాంఛనీయ ఘటనలు జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి విషయం గోప్యంగా ఉంచుతామని అన్నారు. మద్యపానం, మాదక ద్రవ్యాల విక్రయాలు నిర్వహించితే ఉపేక్షించేది లేదన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలు చెడు వ్యసనాలకు బానిసలు అవుతున్నారో లేదో గ్రహించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్ పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుకు రాయితీ

డ్వామా పీడీ జోసఫ్‌కుమార్



మాట్లాడుతున్న పీడీ జోసఫ్‌కుమార్

శావల్యాపురం: ఉద్యాన పంటల సాగుకు సన్న చిన్నకారు రైతులకు రాయితీ కల్పించేందుకు ఉపాధి నిధులు ఖర్చు చేస్తున్నట్లు జిల్లా డ్వామా పీడీ గంగవరపు జోసఫ్‌కుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి ప్రజావేదిక కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి మండలానికి గోకులం షెడ్లు 25 యూనిట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. పూల తోటల సాగును ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు.

ఉపాధి నిధులతో జిల్లాలో ఉద్యాన పంటలైన పండ్ల మొక్కలు సాగు చేయటానికి 1,500 ఎకరాలు లక్ష్యంగా ఇప్పటి వరకు 1200 ఎకరాలు సాగు చేయటానికి రైతులు ఆసక్తి చూపినట్లు తెలిపారు. మెట్ట భూములు నీటి వసతి అనుకూలంగా ఉన్న భూముల్లో ఉద్యాన పంటల సాగు చేసుకునే రైతులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు ఉపాధి కూలీలకు రూ.40 కోట్లు వేతనాలు ఇవ్వాల్సి ఉందని కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన బడ్జెట్‌లో నిధులు కేటాయించారని త్వరలో వేతనాలు వారి బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. గ్రామాల్లో సిమెంటు రోడ్లు, మురుగు కాల్వలు నిర్మాణ పనులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం కల్పించినట్లు పీడీ తెలిపారు. సమావేశంలో జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, ఎంపీడీఓ కొత్రపాటి కవితాచౌదరి, ఏపీఓ కె.రామారావు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు బీసీజీ టీకా

డెప్యూటీ డీఎంహెచ్ఓ మక్కెన పద్మావతి



ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న డెప్యూటీ డీఎంహెచ్ఓ పద్మావతి

శావల్యాపురం: క్షయ వ్యాధిగ్రస్తులు తప్పనిసరిగా బీసీజీ టీకా చేయించుకోవాలని డెప్యూటీ డీఎంహెచ్ఓ మక్కెన పద్మావతి అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం సందర్శించారు. ఆమె మాట్లాడుతూ టీబీ వ్యాధిగ్రస్తులు, షుగర్, సిగిరెట్లు తాగేవారు, 60 ఏళ్ల పైబడిన వారందరు బీసీజీ టీకా చేయించుకోవటం ఆరోగ్యకరంగా చాలా మంచిదని పేర్కొన్నారు. గతంలో క్షయ వ్యాధి బారిన పడి ప్రస్తుతం మందులు వాడుకునే వారందరు ఈ టీకా చేయించుకోవాలని కోరారు. ఈ టీకా వలన సైడు ఎఫెక్టులు ఉండవని చెప్పారు. ఇంటింటికి ఆరోగ్య, ఆశ కార్యకర్తలు తిరిగి షుగర్, క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి టీకాపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటికి వరకు ఒక లక్ష 20 వేల మందికి టీకా చేశామన్నారు. శావల్యాపురం మండలంలో నెల రోజుల వ్యవధిలో 2,500 మందికి టీకా చేశామన్నారు. ఆమె వెంట వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్, ఆరోగ్య సూపర్‌వైజర్ ఉమాదేవి, స్టాఫ్‌నర్సు బాలిబోయిన లక్ష్మి ప్రసన్న, ల్యాబ్ టెక్నీషియన్స్ సతీష్, సీతారామిరెడ్డి ఉన్నారు.

క్షయ నిర్మూలనలో భాగస్వాములు కండి

యడ్లపాడు: క్షయ(టీబీ) వ్యాధిపై నివారణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీహెచ్ఓ గురుమూర్తి చెప్పారు. మండల కేంద్రమైన యడ్లపాడు రచ్చబండ సెంటర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం బీసీజీ టీకాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధి నిర్మూలనలో భాగంగా ప్రతి సోమ, గురువారాల్లో వైద్య సిబ్బంది బీసీజీ వ్యాక్సిన్లు వేయనున్నట్లు వెల్లడించారు. శిబిరంలో ఏఎన్ఎం పార్వతి, ఆశా, అంగన్‌వాడీ పాల్గొన్నారు.

కోనో కార్పస్ చెట్లు తొలగించాలని దీక్ష



టిడ్కో గృహాల వద్ద నిరసన దీక్ష చేస్తున్న రమేష్‌కుమార్, స్థానికులు

నరసరావుపేట: ప్రాణాంతకమైన కోనో కార్పస్ చెట్లను తొలగించాలని దళిత బహుజనుల హక్కుల పోరాట సమితి(డీబీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదా రమేష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు చిలకలూరిపేట రోడ్‌లోని టిడ్కో గృహవాసులతో కలసి గురువారం ఆ ప్రాంతంలోనే నిరసన దీక్ష చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రాణాంతకమైన కోనో కార్పస్ చెట్ల నుంచి వీచే గాలిని పీల్చడం వలన చర్మ, శ్వాసకోశ వ్యాధులు సంభవిస్తున్నాయని పలువురు శాస్త్రవేత్తలు, వైద్యులు సూచిస్తున్నారన్నారు. డెప్యూటీ సీఎం కె.పవన్‌కళ్యాణ్ కాకినాడలో నిర్వహించిన సమావేశంలో కోనో కార్పస్ చెట్లు ప్రాణాంతకమని తక్షణమే వాటిని తొలగించాలని స్థానిక అధికారులను ఆదేశించారన్నారు. స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. ఈ విషయంపై ఇప్పటికే మున్సిపల్ కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాలను అందజేశామన్నారు.

అంతర పంటలతో ఆదాయం



మాట్లాడుతున్న అమలకుమారి

నరసరావుపేట రూరల్: ప్రధాన పంటలతో పాటు అంతర పంటలు సాగుతో ఖర్చు తగ్గి ఆదాయం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారి తెలిపారు. ప్రకృతి వ్యవసాయ కార్యాలయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమలకుమారి మాట్లాడుతూ ప్రీ మాన్ సూన్ డ్రై సోయింగ్ విత్తనాల కిట్స్‌లో 30 రకాల విత్తనాలు 15 కిలోలుగా కిట్‌గా తయారు చేసి రైతుభరోసా కేంద్రాలలో అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. ఈ కిట్‌లో పప్పు దినుసులు, చిరు ధాన్యాలు, నూనె గింజలు, ఆకు కూరలు, తీగజాతి, సుగంధ ద్రవ్యాలు, పచ్చి రొట్ట విత్తనాలు ఉంటాయని వివరించారు. ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ వేసుకోవడం వలన కలుపు నివారించడంతో పాటు ఆకు కూరలు తీసుకోవచ్చని తెలిపారు. పశువుల మేతగా వినియోగించుకోవచ్చని, మిగిలినవి భూమిలో కలియ దున్నడం వలన భూసారం పెరుగుతుందని పేర్కొన్నారు. భూమిలో నీటిని నిలువ చేసుకొనే సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అందరూ కాంపాక్ట్ బ్లాక్‌లు ఏర్పాటుచేసి రసాయనాలు లేని వ్యవసాయం చేయాలని తెలిపారు. బీజామృతంతో విత్తనశుద్ధి, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, గ్రోత్ ప్రమోటర్, అంతర పంటలు, బ్రోడర్ క్రాప్ తప్పని సరిగా వేయాలని తెలిపారు. ఘన జీవామృతం ప్రతి రైతుతో తయారు చేయించి సిద్ధంగా ఉంచాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ అదనపు మేనేజర్ ప్రేమ్‌రాజ్, ఎన్ఎఫ్ఏలు రమేష్, నరసింహ పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు

నాదెండ్ల: వ్యక్తిపై దాడికి పాల్పడిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ బలరామ్‌రెడ్డి తెలిపిన వివరాలు.. కనపర్రు గ్రామానికి చెందిన ఉప్పుతోళ్ల వెంకాయమ్మ అదే గ్రామానికి చెందిన అంకమ్మరావుకు కొన్నేళ్ల క్రితం వడ్డీకి అప్పు ఇచ్చింది. ఏళ్లు గడుస్తున్నా ఫలితం లేకపోవటంతో కోర్టులో దావా వేసింది. దావా ఇంటికి స్వాధీనం చేసుకోమంటూ వెంకాయమ్మకు అనుకూలంగా న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఈ విషయంలో వెంకాయమ్మ, అంకమ్మరావు మధ్య బుధవారం రాత్రి వాగ్వాదం జరిగింది. వెంకాయమ్మతో పాటూ వచ్చిన పూదోట కొండయ్యలపై అంకమ్మరావు ముగ్గురు కుమారులు దాడికి దిగారు. దీంతో క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అక్రమ మద్యం పట్టివేత

మాచర్ల రూరల్: తెలంగాణ నుంచి మద్యం తీసుకొచ్చి విక్రయిస్తున్న వ్యక్తి నుంచి 36 బాటిళ్లు స్వాధీన చేసుకున్న ఘటన మండలంలోని తాళ్లపలిలో గురువారం చోటు చేసుకుంది. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కిషోర్ కథనం.. తెలంగాణ రాష్ట్రం నుంచి తాళ్లపల్లి గ్రామానికి చెందిన కొండా లింగయ్య అనే వ్యక్తి ఆఫీసర్ చాయిస్ విస్కీ 14, మ్యాన్షన్ హౌస్ 12, మరో 10 మద్యం సీసాలు తీసుకొచ్చి గ్రామంలోని శివాలయం సెంటర్ వద్ద విక్రయించేందుకు యత్నిస్తుండగా తమ సిబ్బందితో దాడి చేసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.